సాక్షి
కుమురం భీం

శుక్రవారం ı 6 ı జూన్ ı 2025



నాణ్యతలేని విత్తనం?
ఏటా నాణ్యతలేని విత్తనాలతో జిల్లా రైతులు నష్టపోతూనే ఉన్నారు. కొనుగోలు సమయంలో దుకాణాల నుంచి రశీదులు తీసుకున్నా పరిహారం అందడం లేదు.
10లో▸



స్వయం ఉపాధికి త'రుణం'!
రాష్ట్రప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోంది. సర్కారు ఒక్కో మహిళా సంఘానికి గరిష్టంగా రూ.10 లక్షల రుణం ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది.
11లో▸

గరిష్టం/కనిష్టం
36.0 /28.0

వాతావరణం
మధ్యాహ్నం వేడిగాలులు వీస్తాయి. రాత్రివేళ ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

ఎన్‌ఎంఎంఎస్ ఫలితాలు విడుదల

ఆసిఫాబాద్‌రూరల్: ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ కం మెరిట్ స్కాలర్ షిప్) ఫలితాలు విడుదలైనట్లు డీఈవో యాదయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కాలర్ షిప్ కోసం పరీక్ష రాసిన విద్యార్థుల ఫలితాలు htt p// breteanfana.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

'బెస్ట్ అవైలబుల్ స్కూల్'లో ప్రవేశాలకు ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీటీడీవో రమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 –26 విద్యా సంవత్సరంలో 3, 4, 5వ తరగతుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 17వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పీవీటీజీ తెగకు 4 సీట్లు, ఏజెన్సీ గ్రామాలకు చెందిన విద్యార్థులకు 4 సీట్లు, గిరిజన తెగల విద్యార్థులకు 30 సీట్లను రిజర్వేషన్ ప్రాతిపదికన భర్తీ చేస్తామన్నారు. అర్హులు కులం, నివాసం, ఆదాయం, బోనఫైడ్ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్ జత చేసి జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ నెల 20వ తేదీన లక్కీడిప్ ద్వారా ఎంపిక ప్రక్రియ ఉంటుందని ఆమె తెలిపారు.

విద్యారంగంలో ఫీజుల దోపిడీ అరికట్టాలి




వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి ఫీజుల దోపిడీ అరికట్టాలని గురువారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పరిస్థితి అధ్వానంగా ఉందని, తక్షణమే ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పుట్టగొడుగుల్లా ప్రైవేట్ పాఠశాలలు వెలిశాయని, వాటిల్లో ఇష్టానుసారంగా ఫీజులు దండుకుంటున్నారని ఆరోపించారు. కొన్ని పాఠశాలల్లో టై, బెల్ట్, పుస్తకాలు విక్రయిస్తూ విద్యాసంస్థల్లో వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సమీర్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం.. ఇద్దరిపై కేసు

బెజ్జూర్: పోలీసు విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని సలుగుపల్లి చౌరస్తాలో ఎస్సై ప్రవీణ్‌కుమార్ గురువారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. దహెగాం మండలానికి చెందిన సంజీవ్ అనే వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనాన్ని ఆపగా, అతను లంబాడిగూడ గ్రామ పంచాయతీ పరిధి బోగూడగూడకు చెందిన గోమస దీపక్, అతడి తండ్రి నారాయణలకు సమాచారం అందించాడు. దీంతో వారు అక్కడికి చేరుకొని ఎస్సై వాహనాన్ని అడ్డుకున్నారు. తమ మనిషి బైక్‌నే ఆపుతావా అంటూ ఎస్సై కాలర్ పట్టుకుని దాడికి యత్నించినట్లు తెలుస్తోంది. దీంతో వారిని పోలీసు వాహనంలో ఎక్కించారు. పోలీసులపై దురుసుగా ప్రవర్తించడంతో పాటు విధులకు ఆటంకం కలిగించిన దీపక్, నారాయణలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు వివరించారు.

కరాటే శిక్షణలో ప్రతిభ



కరాటేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

కాగజ్‌నగర్‌టౌన్: డ్రాగన్ కుంపు ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీల్లో కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కరాటే మాస్టర్, జిల్లా డ్రాగన్ కుంపు క్లబ్ ప్రధాన కార్యదర్శి చాపిడి కుమార్ తెలిపారు. పట్టణంలోని ఈఎస్ఐ ఆసుపత్రి మైదానంలో గురువారం నిర్వహించిన పోటీల్లో రఘువర్షన్, సువర్ణలత, అద్విత, సాయి సంకీర్తనలు ఆరెంజ్ బెల్టు సాధించారని పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు కర్ణాటకలో జరుగనున్న గిన్నీస్ రికార్డు పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

కొందరికే భరోసా!



పత్తి చేనులో నాగలి దున్నుతున్న రైతు (ఫైల్)

- యాసంగిలో 87,062 మంది రైతులకే సాయం
- ఇంకా అందించాల్సిన పెట్టుబడి సాయం రూ.131.97 కోట్లు
- ఇప్పటికే మొదలైన వానాకాలం సాగు పనులు
- విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు అన్నదాత తిప్పలు

రెబ్బెన: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన రైతుభరోసా పథకం పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. రైతులు పంటల సాగు పెట్టుబడుల కోసం నానాపాట్లు పడుతున్నారు. సాగుకు యోగ్యమైన భూములకు ఈ పథకాన్ని వర్తింపజేయాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం యాసంగి నుంచి అందజేయాలని భావించింది. అయితే యాసంగి పంటల సీజన్ పూర్తయ్యి వానాకాలం పంటల సీజన్ ప్రారంభమైనా నేటికీ రైతులకు పూర్తిస్థాయి పెట్టుబడి సాయం అందలేదు. కేవలం కొంతమంది రైతులకు మాత్రమే సాయం అందగా వేలాది మంది రైతులు రైతుభరోసా కోసం ఎదురుచూస్తున్నారు.

ఆశల్లో రైతులు..
గత యాసంగి సీజన్‌లో రైతులపై ప్రకృతి కన్నెర్ర చేసింది. అకాల వర్షాలతో అన్నదాతలకు రావాల్సిన దిగుబడులు ఆశించిన స్థాయిలో రాలేదు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో పంటలకు తెగుళ్లు, చీడపీడలు ఆశించి పంటలను దెబ్బతీశాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు అధికసార్లు మందులు పిచికారీ చేశారు. ఆ సమయంలో ప్రభుత్వం రైతుభరోసా పెట్టుబడిసాయాన్ని అందించి ఉంటే పంటల పెట్టుబడులకు ఎంతో కొంత ఉపశమనం లభించేదని రైతులు పేర్కొంటున్నారు. ఎట్టకేలకు యాసంగి సీజన్ ముగియగా ఆశించిన స్థాయిలో పంట దిగుబడులు రాక చాలా మంది రైతులు నష్టపోయారు. ప్రస్తుతం రైతులు వానాకాలం పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. జిల్లాలో అత్యధికంగా సాగయ్యే పంటల్లో పత్తిదే అగ్రస్థానం. ఇప్పటికే రైతులు భూముల్లో దుక్కి పనులు పూర్తిచేసి విత్తనాలు విత్తేందుకు సిద్ధంగా ఉన్నారు. తొలకరి వర్షాలు పడగానే విత్తనాలు విత్తాలని భావిస్తున్నారు. ఈ సమయంలో అయినా ప్రభుత్వం రైతుభరోసా అందిస్తే విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు పెట్టుబడిసాయం డబ్బులు ఆసరాగా ఉంటాయని రైతులు ఆశపడుతున్నారు.

దిక్కుతోచని స్థితిలో కౌలురైతులు
కౌలురైతులకు కూడా పంటల సాగుకు పెట్టుబడి సాయం అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా హామీ ఇచ్చింది. అనంతరం కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా నేటికీ కౌలురైతులకు అందజేసే పెట్టుబడిసాయంపై నిర్ణయం తీసుకోలేదు. దీంతో కౌలురైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఒకవైపు పెరుగుతున్న భూముల కౌలుధరలు, మరోవైపు పెరిగిన విత్తనాలు, ఎరువులు, కూలీల ధరలతో కౌలురైతులు కుదేలవుతున్నారు. పంటల సాగుకు అవసరమయ్యే పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. కౌలురైతులకు సైతం పెట్టుబడి సాయం, బ్యాంకుల ద్వారా రుణాలు అందజేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా నేటికీ కార్యరూపం దాల్చలేదు.

43,373 మంది రైతులకు అందని సాయం

జిల్లాలోని రైతులు సుమారు 4.35లక్షల ఎకరాల్లో ఏటా వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో సాగుకు యోగ్యంగా ఉన్న భూములు, రైతుల వివరాలను సేకరించిన అధికారులు రైతుభరోసా పథకం కింద జిల్లాలో 1,30,435 మంది రైతులను అర్హులుగా గుర్తించారు. గత ప్రభుత్వం రైతుబంధు పథకం ద్వారా ఎకరానికి రూ.5వేల చొప్పున రెండు సీజన్‌లకు కలిపి రూ.10వేలు చెల్లించగా ప్రస్తుత ప్రభుత్వం రైతుభరోసా ద్వారా ఎకరానికి రూ.6వేలు చొప్పున రెండు సీజన్‌లు కలిపి రూ. 12వేలు యాసంగి సీజన్ నుంచి అమలు చేయాలని నిర్ణయించింది. తక్కువ విస్తీర్ణం భూమి కలిగిన రైతులకు ముందుగా ఆపై ఎక్కువ విస్తీర్ణం భూమి కలిగిన రైతులకు పెట్టుబడిసాయాన్ని అందించాలని, ఇప్పటివరకు నాలుగు ఎకరాల వరకు గల రైతులకు ఎకరానికి రూ.6వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. జిల్లాలో ఇప్పటివరకు 87,062 మంది రైతులకు గానూ రూ.93,95,12,916లు డబ్బులు జమ చేసింది. నాలుగు ఎకరాలకు పైగా భూమి ఉన్న రైతులకు నేటికీ పెట్టుబడిసాయం అందలేదు. జిల్లాలో ఇంకా 43,373 మంది రైతులకు పెట్టుబడిసాయం కింద రూ.131.97 కోట్లు జమ కావాల్సి ఉంది.

ఆందోళన అవసరం లేదు



ప్రభుత్వం రైతుభరోసా పెట్టుబడి సాయం కింద నాలుగు ఎకరాల వరకు ఎకరానికి రూ. 6వేల చొప్పున రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమచేసింది. మిగిలిన రైతులకు ఇంకా జమకావాల్సి ఉన్న మాట వాస్తవమే. ఎందుకు జమ చేయలేదో సమాచారం లేదు. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమవుతాయి. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. రైతులందరికీ పెట్టుబడి సాయం అందుతుంది.

– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి

సాంకేతిక విద్య మిథ్య..!

- జిల్లాలో కానరాని పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలు
- ఉద్యోగావకాశాలు కోల్పోతున్న విద్యార్థులు
- విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్



తిర్యాణి: జీవితంలో త్వరగా స్థిరపడాలనుకునే వారికి సాంకేతిక విద్య ఒక ఆయుధంలా పని చేస్తుంది. ఐటీఐ, పాలిటెక్నిక్ వంటి కోర్సులు పూర్తి చేసిన వారికి విపరీతమైన ఉద్యోగావకాశాలు ఉంటాయి. అన్ని రంగాల్లో వెనుకబడిన జిల్లాలో సాంకేతిక విద్య అందించే ప్రభుత్వ కళాశాలలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని కాగజ్‌నగర్ పట్టణంలో ఉన్న ఏకైక ప్రైవేట్ ఐటీఐ కళాశాల మినహా మరెక్కడా ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు లేకపోవడం విద్యారంగంలో జిల్లా వెనుకబడిన తీరుకు నిదర్శనంగా నిలుస్తోంది.

ఉద్యోగ అవకాశాలు..
ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఐటీఐ), పాలిటెక్నిక్ కోర్సుల ద్వారా విద్యార్థులు తక్కువ సమయంలోనే ఉద్యోగావకాశాలు పొందే అవకాశం ఉంది. ఇప్పటివరకు జిల్లాలో కేవలం ఒకేఒక్క ప్రైవేట్ ఐటీఐ కళాశాల మాత్రమే ఉంది. ప్రభుత్వానికి చెందిన సాంకేతిక కళాశాలలు లేకపోవడంతో ఉన్నత చదువులు చదివే స్థోమత లేక జీవితంలో తొందరగా స్థిరపడాలనుకునే విద్యార్థులకు అందుకు అనువైన అవకాశాలు లేకుండా పోతున్నాయి. ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సులు చదవాలంటే దూరప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐటీఐ పూర్తి చేసుకున్న విద్యార్థులకు స్థానికంగా ఉన్న సింగరేణి సంస్థ వేతనంతో కూడిన శిక్షణ (అప్రెంటిషిప్) ఇవ్వడానికి ముందుకు వస్తోంది. ఆర్టీసీ వంటి అనేక సంస్థలు కూడా ఐటీఐ విద్యార్థులకు తమ సంస్థల్లో అవకాశాలు కల్పించేందుకు మొగ్గు చూపుతున్నాయి. అంతే కాకుండా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు సొంతంగా పరిశ్రమ పెట్టుకుని స్వయం ఉపాధితో స్థిరపడే అవకాశం ఉన్నందున ఐటీఐ వంటి కోర్సులు చేసేందుకు విద్యార్థులు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు.

జిల్లా విద్యార్థులకు ప్రయోజనం..
వెనుకబడిన జిల్లాలో ప్రభుత్వ ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేయడం ద్వారా ఎంతో మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది. స్థానికంగా కళాశాలలు లేకపోవడంతో ఇతర జిల్లాలకు వెళ్లి ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సులను అభ్యసిస్తున్నారు. కాగా జిల్లాలో 2024 –25 విద్యా సంవత్సరానికి గాను 6వేలకు పైగా మంది విద్యార్థులు పదో తరగతి ఉత్తీర్ణత సాధించారు. వారందరికీ సాంకేతిక కోర్సుల్లో చేరడానికి అర్హత ఉంటుంది. వీరితో పాటు ఇంటర్ చదివిన విద్యార్థులు సైతం ఈ కోర్సుల్లో చేరడానికి అవకాశం ఉంటుంది. కాగా ఉమ్మడి జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, ఉట్నూర్, ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నప్పటికీ దూరభారంతో పాటు సీట్లు కూడా సరిపోక జిల్లా విద్యార్థులకు అనుకున్న స్థాయిలో అవకాశాలు దక్కడం లేదు.

విద్యారంగం అభివృద్ధి చెందాలి



విద్యారంగంలో అత్యంత వెనుకబడిన జిల్లాను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఈ విద్యాసంవత్సరం నుంచే జిల్లాలో ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు ప్రారంభించాలి. జిల్లాలో సాంకేతిక కళాశాల ఏర్పాటు కోసం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పలుమార్లు ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలల సాధనకు విద్యార్థి సంఘాలు అన్ని ఐక్యమై దశలవారీగా ఉద్యమాలు చేపడుతాం.

– జగజంపుల తిరుపతి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి

పర్యావరణ పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత

- ఏఎస్పీ చిత్తరంజన్



మొక్కకు నీరు పోస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

ఆసిఫాబాద్‌అర్బన్: పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 300 మొక్కలు నాటామన్నారు. కేవలం చెట్లు మాత్రమే ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా మానవాళికి మేలు చేస్తాయని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని, నాటిన ప్రతీ మొక్కను సంరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, ఆర్‌ఎస్సైలు, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలు ఇబ్బందులు పడకుండా చూడాలి



రిలే దీక్షలకు మద్దతు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

- మంత్రి సీతక్క దృష్టి సారించాలి
- ఆదివాసీల రిలేదీక్షలో మాజీ ఎమ్మెల్యే కోనప్ప

ఆసిఫాబాద్‌అర్బన్: అటవీశాఖ నిబంధనలతో ఆదివాసీలు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఇందుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ప్రత్యేక దృష్టి సారించాలని సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఆదివాసీలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు గురువారం మద్దతు తెలిపి, కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం దీక్షా శిబిరంలో మాట్లాడుతూ అటవీ ఉన్నతాధికారుల ఒత్తిడి వల్ల కిందిస్థాయి సిబ్బంది పెట్టే ఇబ్బందులతో జిల్లా ప్రజలు ప్రశాంతంగా జీవించే పరిస్థితి లేదన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలోని పాపన్నపేట, గంగాపూర్ గ్రామాల్లో బోర్‌వెల్ వేసే పరిస్థితి లేదని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి క్షేత్రస్థాయిలో జరుగుతున్న అంశాలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ప్రభుత్వం జీఓ నం.49 తీసుకొచ్చి టైగర్ రిజర్వుగా ప్రకటించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇది అమల్లోకి వస్తే నిర్బంధం మరింత పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. టైగర్‌రిజర్వు ప్రతిపాదనను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు పట్టించుకోకుంటే ప్రజలు తిరుగుబాటు చేస్తారన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

- ఎస్పీ పాటిల్ కాంతిలాల్ సుభాష్



ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న పాటిల్ కాంతిలాల్ సుభాష్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లావాసులకు నిరంతరం అందుబాటులో ఉండి, శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తామని నూతన ఎస్పీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ అన్నారు. ఇదివరకు జిల్లా ఎస్పీగా విధులు నిర్వహించిన డీవీ శ్రీనివాస్‌రావు మెదక్ జిల్లాకు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో పాటిల్ కాంతిలాల్ సుభాష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ కట్టుబడి ఉంటుందని, పౌరుల రక్షణ పోలీసుల ప్రధాన లక్ష్యమన్నారు. సామాన్యుడిని దృష్టిలో పెట్టుకొని వారికి భరోసా కలిగించే విధంగా పోలీసింగ్ ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ నిషేధిత మత్తు పదార్థాల వినియోగం, అసాంఘిక కార్యకలాపాలు చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. ఎవరైనా మతపర దూషణలకు పాల్పడినా, సామాజిక మాధ్యమాల్లో చెడు ప్రచారం చేసినా, ఇతరుల మనోభావాలకు భంగం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

2020 ఐపీఎస్ బ్యాచ్..
పాటిల్ కాంతిలాల్ సుభాష్ 2020 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. 2022లో పాటిల్ కాంతిలాల్ భద్రాద్రి కొత్తగూడెం ఏఎస్పీగా పని చేశారు. 2023 జనవరి నుంచి 2024 జూలై వరకు నిర్మల్ జిల్లా భైంసా ఏఎస్పీగా, 2024 జూలై నుంచి హైదరాబాద్ సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీగా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీగా బదిలీ అయ్యారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి



కౌటాల: దరఖాస్తులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్



సిర్పూర్(టి): వివరాలు తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా

- అదనపు కలెక్టర్ డేవిడ్

కౌటాల: భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ అన్నారు. గురువారం మండలంలోని పార్డీ గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును ఆయన సందర్శించి దరఖాస్తులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టం ద్వారా రైతులు తమ సమస్యలను వెంటనే పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. రైతులు రెవెన్యూ సదస్సుల్లో తమ భూ సమస్యలపై వివరంగా దరఖాస్తులు సమర్పించాలని, రికార్డులను సరిచూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులను కేటగిరీల వారీగా రిజిస్టర్లలో నమోదు చేసి వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన..
కౌటాల మండలం సాండ్‌గాంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ప్రభుత్వం వరికి మద్దతు ధర కల్పిస్తుందని, రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలన్నారు. జాప్యం లేకుండా వరి ధాన్యం తూకం వేయాలని సిబ్బందికి సూచించారు. రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీల కొరత లేకుండా చూడాలని, రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ ప్రమోద్, సహకార శాఖ జిల్లా అధికారి బిక్కు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సును పరిశీలించిన సబ్‌కలెక్టర్
సిర్పూర్(టి): తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో భాగంగా మండలంలోని చింతకుంట గ్రామంలో తహసీల్దార్ రహీముద్దీన్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. గురువారం కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా రెవెన్యూ సదస్సును పరిశీలించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన ఫిర్యాదులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

- సింగరేణి డైరెక్టర్ డి.సత్యనారాయణరావు



పవర్ ప్లాంటులో మొక్కలు నాటుతున్న డైరెక్టర్ సత్యనారాయణరావు, ఈడీ చిరంజీవి

జైపూర్: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని, లేనిపక్షంలో మానవ మనుగడ సాధ్యం కాదని సింగరేణి డైరెక్టర్(ఈఅండ్‌ఎం) డి.సత్యనారాయణరావు తెలిపారు. మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సర్వీస్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని రక్షించడానికి బాధ్యతగా మొక్కలు నాటాలని, కర్బన ఉద్గారాలను తగ్గించాలని కోరారు. ఎస్టీపీపీలో ఏటా మొక్కలు నాటి పరిరక్షిస్తున్నామని తెలిపారు. ప్లాంటు ఆవరణలో భూగర్భ జలమట్టం పెంచడానికి నీటి బిందువు–జల సింధువు కార్యక్రమం ద్వారా ఐదు మినీ చెరువులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్టీపీపీ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు, వోఅండ్‌ఎం చీఫ్ జెన్‌సింగ్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ సత్యనారాయణ, సీఎంవోఏఐ బ్రాంచ్ సెక్రెటరీ సంతోష్‌కుమార్, ఏజీఎంలు మురళీధర్, మదన్‌మోహన్, పవర్‌మేక్ హెడ్ అఖిల్‌కపూర్, డీజీఎంలు అజాజుల్లాఖాన్, తుకారాం, వాసుదేవమూర్తి, ఫారెస్టు మేనేజర్ చంద్రమణి పాల్గొన్నారు.

మొక్కలు నాటిన న్యాయమూర్తి
బెల్లంపల్లి: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కన్నాల శివారులోని నూతన కోర్టు ఆవరణలో బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి జే.ముఖేష్ గురువారం న్యాయవాదులతో కలిసి మొక్కలు నాటారు. అటవీ రేంజ్ అధికారి పూర్ణచందర్, పాల్గొన్నారు.

క్లుప్తంగా

కూతురిపై లైంగికదాడికి పాల్పడిన తండ్రికి జైలు

నిర్మల్‌టౌన్: కన్నకూతురిపై లైంగికదాడికి పాల్పడిన తండ్రికి 20 ఏళ్ల జైలుశిక్షతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి శ్రీవాణి గురువారం తీర్పునిచ్చింది. ఎస్పీ జానకి షర్మిల తెలిపిన వివరాల ప్రకారం.. సోన్ మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఏప్రిల్ 16, 2021న ఇంట్లో నిద్రిస్తున్న ఆరేళ్ల కూతురిపై లైంగికదాడి చేశాడు. ఈ కేసులో సాక్షులు లేక పోవడంతో అప్పటి డీఎస్పీ (ప్రస్తుతం జిల్లా అదనపు ఎస్పీ) ఉపేంద్రరెడ్డి కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశాడు. తల్లి, కూతురు సాక్ష్యం చెప్పడంతో జిల్లా జడ్జి ఈమేరకు తీర్పునిచ్చింది. భయపడకుండా సాక్ష్యం చెప్పిన తల్లి, కూతురిని ఎస్పీ అభినందించారు.

బాసరకు పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో భక్తులు

బాసర: శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయానికి గురువారం భక్తులు పోటెత్తారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు అనంతరం అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో బారులు తీరారు. తర్వాత అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. తల్లిదండ్రులు చిన్నారులతో అక్షరశ్రీకార పూజలు చేయించారు. గురువారం ఒక్కరోజే ఆలయానికి రూ.8,80,000 పైగా ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్

బాసర: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని ట్రిపుల్‌ఐటీలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐరాస సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్ (ఎస్‌డీజీఎస్) ను అమలు చేసిన తొలి ట్రిపుల్ ఐటీ ఇదే అని పేర్కొన్నారు. భవిష్యత్ తరం కోసం ప్రకృతిని కాపాడటం మన బాధ్యత అని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలన్నారు. అనంతరం పర్యావరణాన్ని రక్షించాలని అంటూ అందరితో ప్రతిజ్ఞ చేశారు. అసోసియేట్ డీన్‌లు విఠల్, నాగరాజు, రాకేశ్‌రెడ్డి, పీఆర్వో డాక్టర్ విజయ్ కుమార్ ఉన్నారు.

ఎస్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

జన్నారం:నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్) ఆధ్వర్యంలో, నాబార్డు సహకారంతో ఉమ్మడి జిల్లాకు చెందిన ఎస్టీ విద్యార్థులకు ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచితంగా మూడు నెలల శిక్షణ ఇవ్వనున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ నాగేంద్రన్ ప్రకటనలో తెలిపారు. శిక్షణలో ఉచిత భోజన, హాస్టల్ వసతి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు బయోడేటా, ఆధార్, రేషన్ కార్డులు, ఎస్సెస్సీ మెమో, కులం ధ్రువీకరణ పత్రం, రెండు ఫొటోలను జతచేసి దరఖాస్తు ఫారంను బెల్లంపల్లిలోని వైటీసీ సెంటర్‌లో అందించాలని పేర్కొన్నారు. వివరాలకు 87904 14049 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

నాణ్యతలేని విత్తనం..?

- కంపెనీల ఆఫర్లు.. అంటగడుతున్న డీలర్లు
- ఏటా నాణ్యత లేని వాటితో రైతులకు నష్టం
- రశీదులు ఉన్నా అందని పరిహారం
- గత ఏడాది నష్టపరిహారం ఇప్పటికీ అందని వైనం



నెన్నెలలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు, కంపెనీ ప్రతినిధులు, రైతులు(ఫైల్)

మంచిర్యాలఅగ్రికల్చర్: విత్తేది విత్తనమో.. విపత్తో తెలియని ఆందోళన రైతుల్లో నెలకొంటోంది. ఖరీఫ్ సీజన్ ఆరంభం నేపథ్యంలో గుర్తింపు పొందిన పలు విత్తన కంపెనీల ప్రచారంతో ఏవి మంచో.. ఏవి చెడో తెలియని పరిస్థితి ఎదురవుతోంది. ఏటా జిల్లాలో రైతులు నాణ్యత లేని విత్తనాలతో నష్టపోతూనే ఉన్నారు. కొన్నేళ్లుగా నిషేధిత, నకిలీ పత్తి విత్తనాలు కొంపముంచగా.. గత ఖరీఫ్‌లో నాణ్యత లేని వరి విత్తనాలు దిగుబడి రాక నట్టేట ముంచాయి. కొనుగోలు చేసిన రశీదులతో డీలర్లు, వ్యవసాయ అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా ఫలితం లేకుండాపోయింది. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పరిహారం అందలేదు. డీలర్ల వద్ద కొనుగోలు చేసి అలికిన విత్తనాలతో రైతులు నిండా మునిగారు. రశీదులు ఉన్నా నష్టపోయిన రైతులకు సంబంధిత కంపెనీల నుంచి పరిహారం ఇప్పించడంలో వ్యవసాయ అధికారులు విఫలం అవుతున్నారు.

3.33 లక్షల ఎకరాల్లో సాగు అంచనా..

ఈ ఖరీఫ్ సీజన్‌లో 3.33లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ప్రధానంగా పత్తి, వరి సాగు అధికంగా ఉంటుందని ప్రణాళిక రూపొందించారు. పత్తి, వరి విత్తనాలు ప్రైవేటు డీలర్ల వద్ద కొనుగోలు చేస్తుంటారు. ఏటా సీజన్‌కు ముందు ఫర్టిలైజర్ డీలర్లకు పలు కంపెనీలు అమ్మకాల కోసం ఇచ్చే నగదు, బంగారు నాణేలు, రూ.లక్షల విలువైన బహుమతులు, విదేశీ ప్రయాణాల ఆఫర్లతో అమాయక రైతులకు విత్తనాలు అంటగడుతున్నారు. విత్తన నాణ్యతపై డీలర్‌కు తెలియకపోయినా దిగుబడి బాగా వస్తుందని నమ్మబలుకుతున్నారు. ఈ ఏడాదైనా నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

వేల ఎకరాల్లో నష్టం!

గత ఏడాది వానాకాలం సన్నరకానికి సంబంధించిన కంపెనీ విత్తనాలు నారుపోయగా మొలక బాగానే వచ్చింది. నాట్లు వేసి ఎరువులు వేసినా పంట ఎదుగుదల లేకుండాపోయింది. మరికొంత ముందే పొట్టకు వచ్చి గొలుసు వేశాయి. 110 నుంచి 120 రోజుల వ్యవధిలో ఒకేసారి ఎదిగి దిగుబడి రావాల్సి ఉండగా.. నాటిన 40నుంచి 60రోజులకే 25శాతం పొట్టకు రావడం, ఒకే గొలుసు వేసి గింజలు తక్కువ రావడం, నాణ్యత లేకపోవడం జరిగింది. కంపెనీదారులు, వ్యవసాయ అధికారులు పరిశీలించిన విత్తన లోపం ఉన్నట్లు గుర్తించారు. ఎన్ని ఎరువులు, మందులు వాడినా ఆశించిన దిగుబడి రాలేదు. నష్టపరిహారం అందేలా చూస్తామని కంపెనీ ప్రతినిధులు హామీనిచ్చినట్లు రైతులు తెలిపారు. మళ్లీ ఖరీఫ్ సీజన్ వచ్చినా పరిహారం అందలేదని వాపోతున్నారు. ఎకరానికి రూ.25వేల వరకు పెట్టుబడి నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రశీదులున్నా పరిహారం రాలేదు..



నాకున్న 12ఎకరాల్లో సన్న రకం వరి విత్తనాలు సాగు చేసిన. పంట గొలుసు రాలేదు. ఎకరాన 40నుంచి 50బస్తాల వడ్లు దిగుబడి రావాల్సి ఉండగా 16నుంచి 17బస్తాలు మాత్రమే వచ్చింది. ఏఓ, శాస్త్రవేత్తలు పరిశీలించి గంట బాగా రాలేదని రిపోర్టు ఇచ్చిండ్రు. కంపెనీ వాళ్లను అడుగులే ఎక్కడ చెప్పుకుంటావో చెప్పుకో అని సమాధానం ఇచ్చారు. వ్యవసాయ అధికారులు పట్టించుకోలేదు. విత్తనాలు కొనుగోలు చేసిన రశీదులు ఉన్నాయి. పంటకు పరిహారం అందించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన.

– అత్తె రామయ్య, గ్రామం: మాకులపేట, మం: దండేపల్లి

నాలుగెకరాల్లో నష్టం



గత ఏడాది నాలుగెకరాల్లో సన్నరకం వడ్లు సాగు చేసిన. ఒకటే విత్తనం నాలుగు రకాలుగా పెరిగింది. కొంత ముందే గొలుసు వేసింది, మరికొంత ఇప్పుడే పొట్టకు వచ్చింది. డీలర్‌ను అడిగితే కంపెనీ వాళ్లు వచ్చి చూస్తారని చెప్పాడు. వాళ్లు రాలేదు. చూడలేదు. ఎరువులు, మందులు స్ప్రే చేసినా ఫలితం లేకుండా పోయింది. ఎకరానికి రూ.25వేలు ఖర్చు చేసిన. 40బస్తాలకు పైగా వడ్లు రావాల్సి ఉండగా.. 20బస్తాలకు మించలేదు. కంపెనీపై చర్యలు తీసుకుని పరిహారం ఇప్పించాలి.

– కమలాకర్‌రెడ్డి, గ్రామం: కుందారం, మం: జైపూర్

ఒకటే విత్తనం మూడు రకాలు..



సన్న రకం వరి విత్తనాలు రూ.900 చొప్పున 9బస్తాలు మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో కొనుగోలు చేసిన. మొలక బాగానే రావడంతో నాట్లు వేసుకున్న. నెలన్నర రోజులకే 20శాతం గొలుసు కంకి వచ్చింది. మరికొంత పొట్టకు వచ్చింది. మరికొంత పంట ఎదుగుదల లేదు. పిలకలు లేవు. విత్తన కంపెనీదారులు, వ్యవసాయ అధికారులు పరిశీలించి విత్తన లోపమని గుర్తించారు. దిగుబడి రాకపోతే పరిహారం అన్నారు. ఎకరానికి 40క్వింటాళ్లు రావాల్సింది 15క్వింటాళ్లు కూడా రాక నష్టపోయినా పరిహారం ఇవ్వలేదు.

– తోట మధు, నెన్నెల

వినియోగదారుల ఫోరంను ఆశ్రయించాలి

రైతులు గుర్తింపు పొందిన కంపెనీ విత్తనాలతో నష్టపోతే డీలర్ల వద్ద కొనుగోలు చేసిన విత్తనాల రశీదుతో నష్టం జరిగినప్పుడు వెంటనే వ్యవసాయ అధికారికి, డీలర్‌కు సమాచారం అందించాలి. వినియోగదారుల చట్టం ప్రకారం సివిల్ కోర్టులో కేసు వేస్తే పరిహారం వచ్చే అవకాశం ఉంటుంది. గతేడాది ఖరీఫ్‌లో జిల్లాలో వరి విత్తనాలతో సరైన దిగుబడి రానట్లు మా దృష్టికి వచ్చింది. దీనిపై సంబంధిత కంపెనీకి ఫిర్యాదు చేశాం. ఒకరు ఇద్దరు రైతులు వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు.

– జీ.కల్పన, జిల్లా వ్యవసాయ అధికారి

ఉన్నత లక్ష్యం కోసం శ్రమించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



జెండా ఊపి బస్సు ప్రారంభిస్తున్న ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ఉన్నత లక్ష్యం కోసం విద్యార్థులు శ్రమించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని మోడల్ కళాశాలలో ఉచిత ఇంటర్, ఐఐటీ, జేఈఈ కోచింగ్ కోసం ఎంపికైన విద్యార్థులను ప్రత్యేక బస్సులో పంపించారు. అంతకుముందు వారిని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ.. గత ఏప్రిల్‌లో ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో చదివిన టెన్త్ విద్యార్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఉమ్మడి జిల్లాలో 15 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఐఐటీ, జేఈఈ కోచింగ్ కోసం ఐటీడీఏ ద్వారా చదివిస్తున్నామని తెలిపారు. డీడీ అంబాజీ, ఏసీఎంవో జగన్, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

డీఈఈ సెట్‌లో భైంసావాసికి స్టేట్ ఫస్ట్ ర్యాంక్



హారికకు స్వీట్ తినిపిస్తున్న భర్త రాజేశ్వర్

భైంసాటౌన్: డీఈఈ సెట్(డిప్లొమా ఇన్ టీచర్ ఎడ్యుకేషన్) ఫలితాల్లో భైంసాకు చెందిన తక్కలపల్లి హారిక ఉత్తమ ప్రతిభ కనబర్చింది. ఈ మేరకు గురువారం వెలువడిన ఫలితాల్లో తెలుగు మీడియం విభాగంలో 77 మార్కులతో రాష్ట్రస్థాయిలోనే మొదటి ర్యాంకు సాధించింది. హారిక భర్త రాసమల్లు రాజేశ్వర్ కుంసరలో ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్నాడు. ఎలాంటి కోచింగ్ లేకుండానే ఫస్ట్ ర్యాంకు సాధించిన ఆమెను పలువురు అభినందించారు.

ప్లాంటేషన్ మేనేజర్‌కు ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న సురేశ్‌కుమార్

జైపూర్: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ(టీజీఎఫ్‌డీసీ) మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేశ్‌కుమార్ గురువారం ఆ సంస్థ డివిజనల్ మేనేజర్ శ్రావణి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని టీజీఎఫ్‌డీసీ డివిజన్ కేంద్ర కార్యాలయం కాగజ్‌నగర్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డు పొందారు. టీజీఎఫ్‌డీసీ ఏర్పడి దశాబ్దికాలం పూర్తయిన సందర్భంగా ప్లాంటేషన్ల నిర్వహణలో ఉత్తమ పనితీరుకు గాను ప్రోత్సాహకంగా ఈ అవార్డు అందించినట్లు తెలిపారు. ఈమేరకు ఆయన్ను పలువురు అభినందించారు.

కేకే ఓసీలో రెండు కొత్త షావల్స్



షావల్స్‌కు పూజ నిర్వహిస్తున్న జీఎం దేవేందర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే ఓసీలో గురువారం రెండు కొత్త షావల్స్‌ను ఏరియా జీఎం దేవేందర్ ప్రత్యేక పూజ నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ కొత్త షావల్స్‌ను ప్రారంభించడం వల్ల ఓసీలో బొగ్గు ఉత్పత్తి శాతం పెరుగుతుందన్నారు. ఒక్క షావల్ విలువ రూ.1.72 కోట్ల వరకు ఉంటుందన్నారు. ప్రతీ ఉద్యోగి రక్షణ సూత్రాలు పాటిస్తూ బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. ఆయన వెంట కేకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, ఏరియా ఇంజనీర్ వెంకటరమణ, ప్రాజెక్ట్ ఇంజనీర్ వెంకట వంశీధర్, మేనేజర్ రామరాజు, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సత్యనారాయణ ఉన్నారు.

నార్త్ ఎవరెస్ట్ బేస్‌కు చేరిన ఎంజేపీ విద్యార్థి



గోకులు నాయక్



నార్త్ బేస్ క్యాంపునకు చేరిన ఎంజేపీ విద్యార్థులు

లక్ష్మణచాంద: అడ్వెంచర్ శిక్షణలో భాగంగా తెలంగాణ మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల నుంచి రాష్ట్రవ్యాప్తంగా కొంతమంది విద్యార్థులకు రెండు దఫాలుగా భువనగిరిలోని రాక్ క్లైబింగ్ కేంద్రంలో శిక్షణ ఇచ్చారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 20 మంది ఎవరెస్టు బేస్ క్యాంప్‌నకు ఎంపికయ్యారు. ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన మలావత్ పూర్ణ, రాకేశ్ ఆధ్వర్యంలో పర్వతారోహణకు వెళ్లారు. గతనెల 25న నేపాల్‌లోని టెన్ జింగ్ హిల్లరీ ఎయిర్‌పోర్టుకి చేరుకున్నారు. జూన్ 10 వరకు ఈ ప్రయాణం సాగనుంది. గురువారం 5364 మీటర్ల పొడవైన నార్త్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌ను దిగ్విజయంగా చేరుకున్నారు. ఇందులో లక్ష్మణచాంద మండలం రాచాపూర్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి జె.గోకుల్ నాయక్ ఉన్నారు. సదరు విద్యార్థికి ఆర్‌సీవో శ్రీధర్, డీసీవో గీత, ప్రిన్సిపాల్ రాజు శుభాకాంక్షలు తెలిపారు. తమ విద్యార్థులు అక్కడకు వెళ్లడం సంతోషంగా ఉందన్నారు.


జలపాతంలో దూకి ఆత్మహత్య



నర్సారెడ్డి (ఫైల్)

బోథ్: మండలంలోని పొచ్చెర జలపాతంలో దూకి ఒకరు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నేరడిగొండ మండలం తేజాపూర్ గ్రామానికి చెందిన గడ్డం నర్సారెడ్డి (55) గురువారం జలపాతం వద్దకు వచ్చాడు. ఆయన్ను గమనించి అక్కడికి వెళ్లిన అటవీశాఖ సిబ్బంది ఆరా తీయగా ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. అటవీ సిబ్బంది నుంచి తప్పించుకొని జలపాతంలో దూకాడు. సిబ్బంది వెంటనే అందించిన సమాచారంతో అటవీ అధికారులు, పోలీసులు ఘటనస్థలానికి చేరుకున్నారు. ఫైర్ సిబ్బంది..నర్సారెడ్డిని కాపాడే ప్రయత్నం చేశారు. గజఈతగాళతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంలో ఎస్సై.. జలపాతంలో దిగడానికి ప్రయత్నించారు. అప్పటికే ఈతగాళ్లు మృతదేహాన్ని వెలికితీశారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, గతంలో తండ్రి వ్యవసాయం చేసేవాడని, అప్పులు పెరిగిపోవడంతో ఆత్మహత్య చేసుకున్నాడని పెద్ద కుమారుడు అజయ్‌రెడ్డి తెలిపారు.

అప్పులు తీర్చలేక వ్యక్తి..



లింగయ్య (ఫైల్)

జైపూర్: శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్టు విస్తరణలో దుబ్బపల్లి నష్టపోతుండగా ఇంటికి పరిహారం వస్తుందని వ్యక్తి ఆశించాడు.. ఆ గ్రామాన్ని సింగరేణి సంస్థ తీసుకోకపోవడం, చేసిన అప్పులు తీర్చేమార్గం లేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు తెలిపిన వివరాలు.. మండలంలోని రామారావుపేట పంచాయతీ పరిధి దుబ్బపల్లికి చెందిన కామెర లింగయ్య (56), రాజేశ్వరి దంపతులు కూలీ పని చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. వీరికి కుమారుడు ఆంజనేయులు, కూతురు వరలక్ష్మి. రెండేళ్ల కిందట కూతురి వివాహానికి బంధువుల వద్ద అప్పు చేశారు. దుబ్బపల్లిని సింగరేణి సంస్థ తీసుకోకపోవడం, పరిహారం చెల్లింపు జాప్యం జరగడంతో అప్పులు తీర్చేమార్గం లేక ఈనెల 3న పురుగుల మందు తాగాడు. గురువారం చికిత్స పొందుతూ వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మద్యం తాగొద్దన్నందుకు భర్త ..

మంచిర్యాలక్రైం: మద్యం తాగొద్దని భార్య మందలించడంతో మనస్తాపానికి గురైన భర్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కాలనీలో నివాసం ఉండే ఆరేందుల రమేశ్(35) ప్రైవేటు డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తరచూ మద్యం తాగేవాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో కుటుంబ కలహాలు జరిగేవి. ఈక్రమంలో మద్యం తాగవద్దని భార్య భవాని మందలించడంతో భర్త రమేశ్ మనస్తాపం చెందాడు. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి పోషం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి ఒక కూతురు ఉంది.

కారు ఢీకొని ఒకరి మృతి

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. స్థానికులు, ఎస్సై తహసీనొద్దీన్ తెలిపిన వివరాలు.. మండలంలోని లక్ష్మీకాంతపూర్‌కు చెందిన గాజుల సత్తయ్య(65) మంచిర్యాల నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తున్నాడు. నెల్కివెంకటాపూర్ వద్ద ఎదురుగా అతివేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టడంతో సత్తయ్య తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్సై ఘటన స్థలానికి చేరుకుని, ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

రైల్వేఉద్యోగిపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి

మంచిర్యాలక్రైం: స్థానిక రైల్వేఉద్యోగిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి గాయపర్చినట్లు ఏఎస్సై దివాకర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రైల్వే ట్రాక్‌మెన్‌గా పనిచేస్తున్న మంత్రి శ్రీధర్ బుధవారం రాత్రి బైక్‌పై జిల్లాకేంద్రంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లో వెళ్తున్నాడు. వస్త్ర దుకాణం సమీపంలో వెనుక వస్తున్న ముగ్గురు బైక్‌పై వచ్చి ఢీకొట్టారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఆ ముగ్గురు వారి స్నేహితులకు ఫోన్ చేయగా, మరికొందరు కారులో వచ్చి శ్రీధర్‌పై దాడి చేశారు. బాధితుడు శ్రీధర్ ఫిర్యాదుతో గురువారం కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

గాయపడిన వ్యక్తి తరలింపు

బాసర: బాసర పోలీసుస్టేషన్ ఎదుట గాయపడిన వ్యక్తిని పోలీసులు గురువారం భైంసా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని నిపుణులతో పరిశీలించి ఆధారాలు సేకరించినట్లు పోలీసులు తెలిపారు. అనుమానాస్పద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఒకరిపై కేసు

తానూరు: మండలంలోని హంగిర్గా గ్రామానికి చెందిన హంపోలి బాలాజీపై గురువారం కేసు నమోదైనట్లు ఏఎస్సై భానుప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. అదే గ్రామానికి చెందిన సంతోష్ తన చేను నుంచి మరో చేనుకు విద్యుత్ లైన్ కోసం స్తంభాలు ఏర్పాటు చేసుకుని విద్యుత్ తీగలను తీసుకువెళ్తున్నాడు. నా పొలం నుంచి విద్యుత్ తీగలు ఎందుకు తీసుకువెళ్తున్నావని బాలాజీ ఈనెల 4న సంతోష్ ఇంటికి వెళ్లి గొడవపడ్డాడు. బండరాళ్లతో దాడి చేయడంతో సంతోష్, తండ్రి సాయినాథ్‌కు గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

గంజాయి సేవిస్తున్న పది మంది అరెస్ట్

గుడిహత్నూర్: మండలంలోని దంపూర్ శివారు ప్రాంతంలో గంజాయి సేవిస్తున్న 10 మందిని బుధవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు ఇచ్చోడ సీఐ బండారి రాజు, ఎస్సై యానకి మధు కృష్ణ తెలిపారు. పక్కా సమాచారంతో పోలీసులు అక్కడికి వెళ్లగా వివిధ గ్రామాలకు చెందిన 10 మంది గంజాయి సేవిస్తూ పట్టుబడ్డారు. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన తుకారాం, గుడిహత్నూర్‌కు చెందిన శేక్ నాసిద్, సోను కుమార్, మచ్చాపూర్‌కు చెందిన కేశవ్, నందు, సూర్యగూడకు చెందిన భరత్, ఇచ్చోడ మండలం గాంధీనగర్‌కు చెందిన శ్రీకాంత్, జున్నీకి చెందిన తుకారాం, జైనథ్ మండలం పార్డీ (బి)కి చెందిన పోతరాజ్ సంతోష్, వరంగల్ జిల్లాకు చెందిన కళ్యాణి చంద్రయ్యను అదుపులో తీసుకున్నారు. వారి నుంచి కిలోగంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖండేవ్ ఆలయంలో మొహాతురు పూజలు



పూజలు చేస్తున్న తొడసం వంశీయులు

నార్నూర్: మండల కేంద్రంలోని ఖండేవ్ ఆలయంలో ఆదివాసీ గిరిజనులైన తొడసం వంశీయులు గురువారం మొహాతురు పూజలు చేశారు. నాటేందుకు సిద్ధంగా ఉంచిన విత్తనాలను దేవుడికి సమర్పించారు. ప్రతీ ఏటా విత్తనాలు నాటే ముందు తమ సంస్కృతి సంప్రదాయ ప్రకారం ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ వస్తోంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ తొడసం నాగోరావు మాట్లాడుతూ ఏడాదికోసారి పెద్దదేవుడితోపాటు కుల, గ్రామదేవతలకు నియమ నిష్ఠలతో పూజలు చేసి మొక్కుతామన్నారు. పూజల తర్వాతే వ్యవసాయ పనులు ప్రారంభిస్తామన్నారు. చిత్తగూడ, మాన్కాపూర్, నార్నూర్ గ్రామాలే కాక చుట్టుపక్కల నుంచి ఆదివాసీ గిరిజనులు తరలివచ్చారు. ఐటీడీఏ డైరెక్టర్ మాడవి మాన్కు, మాజీ ఎంపీపీ మెస్రం రూప్‌దేవ్, పూజార్లు తొడసం రాజు పటేల్, తొడడసం బాపురావు, కటోడా తొడసం అంబాజీరావుపటేల్, గ్రామాల పటేళ్లు, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

సూర్యేశ్వర స్వామి ఆలయంలో పూజలు



నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు

బాసర: బాసర గోదావరి వద్ద సూర్యేశ్వర స్వామి(శివాలయం)లో ఆలయ వైదిక బృందం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. నవగ్రహ మండపం మరమ్మతు చేసి నూతన విగ్రహాలను పునఃప్రతిష్ఠాపన నిర్వహించారు. వివిధ పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాఠక్, ఆలయ ఏఈఓ సుదర్శన్ గౌడ్, వేద పండితులు, వైదిక బృందం దేవస్థాన సిబ్బంది, శివాలయ అర్చక బృందం వాగ్దేవి సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

నవీన బోధన వ్యూహాలపై ఎఫ్‌డీపీ



పాల్గొన్న అధ్యాపకులు

బాసర: ఆర్జీయూకేటీలో గురువారం 'నవీన బోధన వ్యూహాలు' అనే అంశంపై (FDP) ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమం నిర్వహించారు. ఆధునిక బోధన పద్ధతులపై అధ్యాపకులకు ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ అవగాహన కల్పించారు. బోధనలో నూతన తీరు తెన్నులను వివరించారు. ప్రత్యేక ఆహ్వానితులు ప్రముఖ శిక్షణ నిపుణుడు రమేశ్ వేముగంటి వివిధ అంశాల గురించి తెలియజేశారు. విద్యార్థుల ప్రయోగశాలలు, వర్క్‌షాప్‌లు, ప్రాజెక్టులు, గ్లోబల్ థింకింగ్లో అభ్యాసాన్ని మెరుగుపరచడం ద్వారా ప్రభావవంతమైన బోధనకు అవసరమైన జీవన నైపుణ్యాలు కల్పించవచ్చన్నారు. అసోసియేట్ డీన్లు డాక్టర్ మహేశ్, డాక్టర్ విఠల్, నాగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళ కడుపులో కణతి తొలగింపు



తొలగించిన కణతి చూపుతున్న వైద్యులు అపూర్వ, రజనీకాంత్

భైంసాటౌన్: కడుపునొప్పితో బాధపడుతున్న ఓ మహిళకు భైంసా ఏరియాస్పత్రి వైద్యులు శస్త్ర చికిత్స నిర్వహించి ఆరు కిలోల కణతిని తొలగించారు. ముధోల్ మండలం చింతకుంటకు చెందిన చిన్నమ్మ(58) కొద్దికాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఈక్రమంలో మూడురోజుల క్రితం భైంసా ఏరియాస్పత్రిలో చేరగా, పరీక్షించిన వైద్యులు ఆమె కడుపులో కణతి ఉన్నట్లు గుర్తించారు. గురువారం వైద్యులు అపూర్వ, రజనీకాంత్, ప్రీతి నేతృత్వంలో మహిళకు శస్త్ర చికిత్స నిర్వహించి, కణతి తొలగించారు. దీంతో బాధిత మహిళ కుటుంబీకులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్‌తోపాటు తోటి వైద్యులు వైద్య బృందాన్ని అభినందించారు.

నకిలీ దస్తావేజులతో స్థలాన్ని కబ్జా చేసిన నిందితుల అరెస్టు

- ఐదుగురిపై కేసు, ముగ్గురి రిమాండ్

కైలాస్‌నగర్: నకిలీ ఇంటి నంబర్, దస్తావేజులు సృష్టించి షాపును, స్థలాన్ని కబ్జా చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఈమేరకు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని గణేశ్ టాకీస్ పక్కన 6-6-2/1 ఇంటి నంబర్ గల బుచ్చమ్మకు చెందిన షాప్‌ను ఏ-1 సయ్యద్ జహీరుద్దీన్ అద్దెకు తీసుకున్నారు. అందులో ఉంటూ నకిలీ లీజు డాక్యుమెంట్లు సృష్టించాడు. దీని ఆధారంగా మున్సిపాలిటీలో ఫేక్ డోర్ నంబర్‌ను తీసుకున్నాడు. పట్టణంలో సీనియారిటీ కలిగిన డాక్యుమెంట్ రైటర్ ఏ-5 ఫయాజుద్దీన్ సిద్దిఖీ అలియాస్ సాహెర్ భాయ్(అరెస్టు) షాపును కాజేయాలనే దురుద్దేశంతో తన కుమారుడు, ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ పత్రాల ఆధారంగా షాపును కబ్జా చేసి నిజమైన వారసులకు దుకాణాన్ని ఇవ్వకుండా వారే ఉంటున్నారు. దుకాణానికి ఫేక్ నంబర్‌ను కేటాయించడంపై మున్సిపాలిటీలో బాధితురాలు ఫిర్యాదు చేయగా కమిషనర్ విచారణ చేపట్టి రద్దు చేశారు. వివాదంలో ఉందనే విషయం తెలిసి కూడా ఉద్దేశపూర్వకంగా రిజిస్ట్రేషన్ చేసుకుని కబ్జా చేసిన ఏ-2 మహమ్మద్ సోహెబ్, ఏ-3 ఎస్తేర్ హుస్సేన్, ఏ-4 షేక్ అబిద్ షేక్‌నూర్‌లపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లుగా వివరించారు. ఇందులో సిరాజుద్దీన్, ఫయాజుద్దీన్, సోహెబ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా ఎస్తేర్ హుస్సేన్, షేక్ అబిద్ షేక్‌నూర్ పరారీలో ఉన్నారని డీఎస్పీ పేర్కొన్నారు.